క్లుప్తంగా

అక్కడ ఇంకా.. వరద నీరు



ఓక్షిత్ ఎంక్లేవ్ రోడ్డు నెంబరు 2లో పారుతున్న వరదనీరు

సుభాష్‌నగర్: జులై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎంక్లేవ్ జలదిగ్బంధంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే వరద సమస్య నుంచి తేరుకుంటున్నారు. ఇంకా పూర్తి సమస్య నుంచి బయట పడలేదు. కాలనీలోని రోడ్డు నం.2లో కొన్ని ఇళ్లు, ప్లాట్స్ ఇంకా జలదిగ్బంధంలోనే చిక్కుకొనే ఉన్నాయి. ప్రస్తుతం మూడు నెలల నుంచి ఆ రోడ్డుపై వరద నీరు కొనసాగుతూనే ఉంది. అధికారులు మాత్రం సమస్య ఉన్న చోట పక్కనపెట్టి వేరే చోటు నుంచి కృత్రిమ నాలాను ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

టార్గెట్.. సేఫ్ పార్కింగ్

- తెలివిగా వాహనాల పార్కింగ్
- కమిటీహాళ్లు, అంగన్‌వాడీ సెంటర్లను ఎంచుకుంటున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గురుమూర్తినగర్ కమ్యూనిటీహాల్ ఎదుట పార్క్ చేసిన వాహనాలు

రంగారెడ్డినగర్: వాహనాల పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.. గల్లీల్లోని రోడ్లు, ఇళ్ల ముందు వాహనాలను పార్కింగ్ చేస్తూ ఇతరులకు ఇబ్బందులు సృష్టిస్తున్న వాహనదారులు తమ పంథా మార్చుకున్నారు. తాజాగా కమిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఎదుట పార్కింగ్ మొదలు పెట్టారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్ కమ్యూనిటీహాల్ తాజాగా పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఇందులోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. భవనం నలు వైపులా ఆటో ట్రాలీలు, కార్లు, ఆటోలను పార్కింగ్ చేయడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చీ పోయే చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. అక్రమ పార్కింగ్‌లపై సంబంధిత అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేపు నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0ను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.సంగారెడ్డి జిల్లాలో బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ విద్యాభారతి హైస్కూల్, పటాన్‌చెరు మండలం పాశమైలారం ఐటీడబ్ల్యూ ఇండియా లిమిటెడ్, రుద్రారం ఎంఎస్ఎన్ లాబరేటరీలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రీసైక్లింగ్ పేరుతో
నాలాల్లోకి రసాయనాలు

జీడిమెట్ల: రీసైక్లింగ్ ముసుగులో నాలాలోకి రసాయనాలను వదులుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సుభాష్‌నగర్ డివిజన్ జేజే కాలనీలో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా రసాయన పౌడర్ కవర్లను వివిధ పరిశ్రమల నుంచి తీసుకువచ్చి ఇక్కడ శుభ్రపరుస్తున్నారు. అనంతరం వెలువడే నీటిని నేరుగా నాలాలోకి వదులుతున్నారు. ఇంత తంతు జరుగుతున్న పట్టించుకోవాల్సిన మున్సిపల్, పీసీబీ అధికారులు తమకేమి పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిశ్రమలు సుభాష్‌నగర్ డివిజన్‌లో 50పై చిలుకు ఉన్నాయి. సదరు పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు గాని పేర్లు గాని ఉండవు. వీరి దందా మాత్రం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది.



సుభాష్‌నగర్ డివిజన్ జేజే కాలనీలోని రీసైక్లింగ్ పరిశ్రమ



పనిచేస్తున్న బాలకార్మికుడు

బాల కార్మికులతో పనులు చేయిస్తూ..

జేజే కాలనీలో ఉన్న సదరు పరిశ్రమలో ఓ బాలుడు పనిచేస్తున్నాడు. సదరు బాలుడిని యజమాని రాజస్థాన్ నుంచి తీసుకువచ్చి ఇక్కడే పనిచేయిస్తూ అందులోనే ఓ గదిలో వసతి కల్పించి ఉంచాడు. బాలుడు ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే పనిచేస్తూ కనిపిస్తాడు. పరిశ్రమ యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా బాలకార్మికునితో పనిచేయిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల ఇదే విధంగా ఓ ప్లాస్టిక్ కంపెనీలో బాలకార్మికుడు పని చేస్తుండగా బాలానగర్ స్పెషల్‌టీం పోలీసులు సదరు పరిశ్రమ యజమానిపై కేసు నమోదు చేశారు. ఏవి ఎమైనా అనుమతులు లేని రీసైక్లింగ్ పరిశ్రమలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే దిశగా చర్యలు

కుత్బుల్లాపూర్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 582 పోలింగ్ కేంద్రాలు ఉండగా 6 లక్షల 69 వేల ఓటర్లు ఉన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1400 నుంచి 1600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకున్న అధికారులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాలను దగ్గరలోనే ఏర్పాటు చేశారు.

- అయితే వీటిలో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి అన్న విషయంపై కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు ఆధ్వర్యంలో ఎన్నికల విభాగం అధికారులతో కలిసి గత వారం రోజులుగా ఆయా పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలిస్తూ వెబ్ కాస్టింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎలక్ట్రికల్, ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లేలా ర్యాంపు, మంచినీటి వసతి, బాత్‌రూమ్‌లు, గదులను తనిఖీ చేస్తూ వస్తున్నారు.
- ఏదైనా అవసరం పడితే అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేస్తూ అక్కడ అత్యవసర పనులను చేపడుతున్నారు. నవంబర్ 30వ తేదీన జరిగే పోలింగ్‌తో పాటు కౌంటింగ్ కేంద్రాల్లో సైతం అన్ని వసతులు ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం అధికారులు సుమారు 90 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొంపల్లి దుండిగల్ నిజాంపేట్ ప్రాంతాలతో పాటు జంట సర్కిల్లో పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు.



పోలింగ్ బూత్‌లలో సదుపాయాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి పులి సైదులు

- అసెంబ్లీ ఎన్నికలకు అల్వాల్ లయోలా జూనియర్ కాలేజ్ స్ట్రాంగ్ రూములు సిద్ధం చేశారు. ఈవీఎంలు, వివి ప్యాట్లను భద్రపరిచే డీఆర్సీ కేంద్రాన్ని కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు సందర్శించారు. అక్కడ సీసీ కెమెరా వీడియో కెమెరాల నిఘా ఉంటుందని పేర్కొన్నారు.
- మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారం గ్రామంలో ఉన్న హోలీ మేరీ ఇంజినీరింగ్ కళాశాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని అధికారులు తెలిపారు.

అభివృద్ధిని కాంక్షించే వాళ్లు బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలి



ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ సీనియర్ నాయకుడు ఎంఎస్‌వాసు

కుత్బుల్లాపూర్: మతతత్వ రాజకీయాలకు దూరంగా ఉండి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్‌కు చెందిన కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి ఎంఎస్ వాసు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుబ్బల లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆడబాల వెంకటరత్నం తదితరులు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ జెండా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ... బీజేపీ మత రాజకీయాలు దేశ ప్రజలను విడగొట్టే విధంగా ఉన్నాయన్నారు. అభివృద్ధిని కాంక్షించే వాళ్లు బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందుంటా

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటాని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన వారు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి సమస్యలు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా దసరా పండుగ సందర్భంగా పలువురు ఎమ్మెల్సీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ట్రాఫిక్ సమస్య ఇప్పట్లో పరిష్కారమయ్యేట్లు లేదు!

నిజాంపేట్: ప్రగతినగర్ వాసులకు ఇప్పుడే ట్రాఫిక్ ఇక్కట్లు తొలగే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రగతినగర్ ప్రధాన రోడ్డు మరమ్మతు పనుల నేపథ్యంలో రెండు వారాలుగా మోర్ సూపర్ మార్కెట్ నుంచి ఇన్‌కాయిస్ సర్కిల్ వరకు రోడ్డును అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో బ్లాక్ చేశారు. నిత్యం వందలాది వాహనాలను రద్దీగా ఉండే ఈ మార్గాన్ని వన్‌వే చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లోని ట్రాఫిక్ రద్దీ సమయాల్లో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇంకెన్ని రోజులు తమకు ఈ ట్రాఫిక్ ఇబ్బందులని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.



ప్రగతినగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం

ఫుట్‌పాత్.. బిజినెస్‌కు ఫ్రీ స్పాట్!



బాలానగర్‌కు వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన ప్రైవేటు బస్సు

చింతల్: కోట్లాది రూపాయలతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు అక్రమార్కులకు అడ్డాలుగా మారాయి. ఐడీపీఎల్ నుంచి బాలానగర్‌కు వెళ్లే దారి... డీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట రోడ్డు... గాజుల రామారం చౌరస్తా నుంచి గాజులరామారం రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను అక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కొంతమంది అయితే ఏకంగా బస్సులను సైతం ఫుట్‌పాత్‌ల పైనే పార్కింగ్ చేస్తుండటం గమనార్హం. కొన్ని చోట్ల రోడ్డు వెంట నాటిన మొక్కలు ఫుట్‌పాత్‌ను ఆనుకుని మొక్కలు ఏపుగా పెరుగుతున్నా అలాగే వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై అక్రమ పార్కింగ్‌లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరుతున్నారు.



గాంధీనగర్ నుంచి ఐడీపీఎల్‌కు వచ్చే దారిలో దుకాణాల ఏర్పాటు

'రిజర్వాయర్‌లో దొంగలు పడ్డారు'

అల్యూమినియం తలుపు చోరీ

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ పరిధిలోని కైసర్‌నగర్ రిజర్వాయర్ వద్ద దొంగలుపడ్డారు. పలు రిజర్వాయర్లకు రాత్రి వేళల్లో సెక్యూరిటీ లేకపోవడంతో రిజర్వాయర్‌కు ఉన్న అల్యూమినియం తలుపును ఎత్తుకెళ్లారు. ఇటీవల జీఎం శ్రీధర్‌రెడ్డి రిజర్వాయర్ విజిట్‌కు వెళ్లిన సమయంలో తలుపు లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే విషయమై జీఎం శ్రీధర్ రెడ్డిని ×సాక్షి×వివరణ కోరగా తలుపు విషయమై ఆరా తీస్తున్నామని రాత్రి సమయంలో సెక్యూరిటీ ఉన్నా తలుపు మాయం అవడంతో పాత వారిని విధుల్లో నుంచి తొలగించి కొత్తవారిని నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా రాత్రి సమయంలో సెక్యూరిటీ సిబ్బందిని మరింతగా పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రికి దుర్గామాత మాలధారులు



శివాలయం నగర్ నుంచి షాపుర్‌నగర్ వరకు కాలినడకన వెళ్తున్న దుర్గామాత మాలధారులు

సుభాష్‌నగర్: ఇటీవల దసరా పండుగను పురస్కరించుకొని దుర్గామాత మాల ధరించిన భక్తులు విజయవాడలోని దుర్గామాతను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. షాపూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దుర్గ మాత మాలలు ధరించిన వారు పదుల సంఖ్యలో శివాలయంనగర్ నుంచి షాపుర్‌నగర్ వరకు కాలినడకన వచ్చి వాహనంలో విజయవాడకు తరలి వెళ్లారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కూన శ్రీశైలంగౌడ్ భేటీ

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ బుధవారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ అధినాయకత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసిన సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురు దాదాపు అరగంట పాటు చర్చించారు. ఈ భేటీలో పలువురు బీజేపీ నాయకులు, హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బుజ్జగించి మరీ చేర్చుకుంటున్న పార్టీల నేతలు



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

జీడిమెట్ల: ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో నాయకులు అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని వదలడంలేదు. రా.. అన్న వచ్చేది మన ప్రభుత్వమే అంటూ బుజ్జగించి పార్టీలోకి చేర్చుకుంటున్నారు. కాలనీల, అసోషియేషన్‌ల అధ్యక్షులు, పాత మిత్రులను కలుసుకుని వారి పార్టీల్లోకి చేర్చుకుంటున్నారు. బుధవారం ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌కు చెందిన కాలనీ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ నాగిళ్ల నరేందర్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

- కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి నేరుగా ఆయన ఇంటికి వెళ్లి మాట్లాడి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు కాలనీకి చెందిన కొంతమంది కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. స్థానిక కార్పొరేటర్ భర్త బీఆర్ఎస్ నాయకులు సురేష్‌రెడ్డికి అత్యంత ఆప్తుడైన నరేందర్‌రెడ్డి పార్టీ మారి బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి కాలనీలో ఉండి ఏడుసార్లు వరుసగా జనప్రియ అపార్ట్‌మెంట్‌కు నరేందర్‌రెడ్డి అధ్యక్షుడిగా పని చేశారు. ఏది ఎమైనప్పటికి కాలనీలో బీఆర్ఎస్ పార్టీకి నష్టమేనని పలువురు అంటున్నారు.

కాంగ్రెస్ గూటికి రంగారెడ్డినగర్, సూరారం, సుభాష్‌నగర్ డివిజన్ల నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. పార్టీలో చేరికలే ఇందుకు నిదర్శనమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు సత్తిరెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్, సూరారం డివిజన్ బీఆర్ఎస్ మహిళా మైనార్టీ నాయకురాలు షెహనాజ్‌బేగం, సుభాష్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు నరేందర్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కుండువాలు కప్పిన హన్మంత రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సంక్షేమ ఫలాలను అందరికి చేరేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్, జెస్సి పాల్, గణేష్, తైలం శ్రీనివాస్, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పుతున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

డేంజర్ మలుపు!
ఆదమరిస్తే అంతే!



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

నిజాంపేట్: ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వాహనదారులకు పాలిట శాపంగా మారుతోంది.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గ్రామం నుంచి డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం మీదుగా వెళ్తున్న 100 పట్ల రోడ్డు జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. మూలమలుపు వద్ద ఎదుటి వాహనాలు కనిపించకపోవడంతో ఎదురెదురుగా వేగంగా వచ్చే వాహనదారులు ఒక్కసారిగా ఢీకొట్టుకుంటున్నారు. దీంతో ఇరువురి మధ్య కొట్లాటలు జరిగిన ఘటనలు చాలా ఉన్నాయి.

ఒక పక్క మూలమలుపు, మరో పక్క చెరువు..

జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని రోడ్డులో ఒక వైపు మూలమలుపు, మరో వైపు తుర్క చెరువు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలములపులో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో మరో వైపున ఉన్న తుర్క చెరువులోకి వాహనాలు దూసుకెళ్తున్నాయి. దీంతో మూలమలుపు వద్ద రెండు వైపులా ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

వీధి దీపాల లేక ఇక్కట్లు..

ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా రాడ్లు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో వాటిని గుర్తించక వాహనదారులు ఢీకొంటున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఇటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు జంకాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అయితే చుట్టు పక్కల నుంచి పలు బస్తీలు, కాలనీ ప్రజలకు జర్నలిస్ట్ కాలనీ నుంచి నిజాంపేట్‌కు ఇదే మార్గం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. మూలమలుపు వద్ద రోడ్డును వెడల్పు చేయడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన చెరువును ఆనుకుని కాంక్రీట్ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆ ఎన్నికల్లో చరిత్ర సృష్టించిన 'కూన'

కుత్బుల్లాపూర్: మేడ్చల్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న కుత్బుల్లాపూర్ 2009లో పునర్విభజనలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. ఇక్కడ జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో ప్రజలు వినూత్న తరహాలో తీర్పునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్, వామపక్షాల ఆధ్వర్యంలో పోటీలో ఉన్న ఉద్దండులను పక్కనపెట్టి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్‌కు పట్టం కట్టడం విశేషం. మొదటి ఎన్నికల్లోనే స్వతంత్రుడిగా విజయం సాధించి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టిన శ్రీశైలం గౌడ్ చరిత్ర సృష్టించాడని చెప్పుకోవచ్చు. తదనంతరం కాంగ్రెస్ అనుబంధ సభ్యుడిగా కొనసాగుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి శిష్యుడిగా ఉంటూ వచ్చారు. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా బీజేపీ నుంచి అసెంబ్లీ బరిలో ఉన్నారు.



ఫ్లాగ్‌మార్చ్..

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. బుధవారం సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సూరారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సూరారం చౌరస్తా మీదుగా పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీలు చేశారు.



సూరారం ప్రధాన రోడ్డులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సొంత గూటికి మోహన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఎన్నికల వేళ పార్టీల్లో చేరికలు జోరందుకున్నాయి. ప్రతిపక్షాలకు చెందిన నాయకులు అధికార పార్టీలోకి.. అదే విధంగా అధికార పార్టీ అసంతృప్తులు ప్రతిపక్ష పార్టీల్లోకి జంపింగ్ చేస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకుడు మోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. అయితే ఎమ్మెల్యే వివేకానంద్ తీరు నచ్చకపోవడంతో బుధవారం ఆయన తిరిగి తన సొంతగూటికి చేరుకున్నారు. గాజులరామారంలోని కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో తిరిగి పార్టీలో చేరారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బుచ్చిరెడ్డి, మోతె శ్రీనివాస్ యాదవ్, సాయిరామ్‌రెడ్డి, జూల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది
Sri.V.V.BHASKER RAO
S/o.VENKAIAH, Age : 75 Years,
R/o.H.No.1-76/1/B/1,
Pet Basheerabad, Ganga Enclave,
Secunderabad నా యొక్క Ratification
Deed Vide Document No.3522/1999
and Rectification Deed Vide
Document No.176/1995, Regd. at
Sub Registrar Medchal, ఇట్టి భూమి
పత్రం పోయినది. దొరికినవారు అందజేయగలరు.
Ph : 9666633339

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029